# పేదల చెంతకు మెరుగైన వైద్య సేవలు



దేక్‌లూంగే పాటకు అనుగుణంగా గులాబీ కండువా ఊపుతూ హుషారెత్తిస్తున్న సంజయ్ కుమార్

- జిల్లా కేంద్రంలో మాతాశిశు, మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశాం
- అభివృద్ధి చేసినోళ్లకే ఓటెయ్యండి
- పట్టణంలో పలు వార్డుల్లో కార్నర్ మీటింగ్స్‌లో డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 20: పాత బస్టాండ్‌లో ఇరుగ్గా ఉన్న ప్రభుత్వ దవాఖానను అభివృద్ధి చేసి, నూతనంగా వంద పడకల మాతాశిశు సంరక్షణ దవాఖాన నిర్మించామని, రూ. 500కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి పేదల చెంతకు సర్కారు వైద్యాన్ని తెచ్చామని జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 8, 9, 35, 44, 45 వార్డుల పరిధిలోని టవర్ సర్కిల్, బస్ డిపోలో సంజయ్‌కుమార్ సోమవారం సాయంత్రం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ సంజయ్‌కుమార్‌ను కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో కులమతాలకతీతంగా నిధులు మంజూరు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. జగిత్యాల పట్టణంలో గూడు లేని 3700 మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇచ్చామని, ఇంకా 800 ఇండ్లు మిగిలి ఉన్నాయని, వాటిని అర్హులకు అందిస్తామనన్నారు. కుల మతాలకతీతంగా గుడులు, మసీదులు, బడులకు నిధులు కేటాయించామన్నారు. ప్రతిపక్షాలు కుల, మత రాజకీయాలు చేస్తూ నీచస్థితికి దిగజారాయన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు బొడ్ల జగదీశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, నాయకులు జీఆర్ దేశాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాతను మరోసారి గెలిపించుకోవాలి

- మరోసారి సంజయ్ కుమార్‌ను ఆశీర్వదించండి ■ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో సంజయ్ సతీమణి రాధికతో కలిసి ప్రచారం



చిన్నారిని ఎత్తుకొని నినాదాలు చేస్తున్న దావ వసంత

జగిత్యాల రూరల్, నవంబర్ 20: అభివృద్ధి చేస్తున్న డాక్టర్ సంజయ్ కుమార్‌ను మరోసారి ఆశీర్వదించాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేసి అన్ని వర్గాలకు మేలు చేస్తున్న సంజయ్ కుమార్‌కు అండగా నిలవాలన్నారు. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. ప్రభుత్వం వచ్చాక రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తామన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల ఉచిత బీమా కల్పిస్తామన్నారు. ఆసరా, వికలాంగుల పెన్షన్, రైతు బంధు ఆర్థిక సహాయాన్ని పెంచుతామని చెప్పారు. గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించి రూ.400కే అందిస్తామన్నారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తూ పంటల పెట్టుబడి సాయం, సాగునీరందిస్తున్న సీఎం కేసీఆర్ వెంటే ఉండాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆయా గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకం మమత, నాయకులు సతీశ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాబితాపూర్‌లో ప్రచారం చేస్తున్న వసంత, రాధిక



హబ్సీపూర్‌లో ఎమ్మెల్యేకు విరాళం అందజేస్తున్న గ్రామ సర్పంచ్

## డాక్టర్ సంజయ్ కుమార్‌కు విరాళాలు

జగిత్యాల రూరల్, నవంబర్ 20: హబ్సీపూర్‌లో ఎన్నికల ప్రచారం చేసేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు గ్రామ సర్పంచ్ మారు రాజేశ్వర్ రెడ్డి రూ.25వేలు, ఇదే గ్రామానికి చెందిన చెక్కపెల్లి లచ్చవ్వ తన పింఛన్ నుంచి రూ.వెయ్యి సోమవారం గ్రామంలో విరాళంగా అందజేశారు. అలాగే తక్కళ్లపెల్లి గ్రామ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బత్తిని లింగన్న రూ.5వేలు ఎమ్మెల్యేకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

రాయికల్, నవంబర్ 20: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాయికల్ మున్సిపల్‌లో ఓటరు అవగాహనపై ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో స్వీప్ మెంబర్ సిరిసిల్ల శ్రీనివాస్, కమిషనర్ గంగుల సంతోష్ కుమార్, మేనేజర్ వెంకటి, బీఎల్‌వోలు, ఆర్పీలు, వార్డు అధికారులు, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.

## అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

జగిత్యాల రూరల్, నవంబర్ 20: పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో సోమవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, పిల్లల హక్కులు పరిపూర్ణంగా పొందేలా కృషి చేయాలన్నారు. హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పిల్లలతో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో సీడబ్లూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు, డీసీపీయూ సిబ్బంది, చైల్డ్‌లైన్ సిబ్బంది, వాల్మీకి ఆవాసం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన

జగిత్యాల టౌన్, నవంబర్ 20: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం దత్తత గ్రామమైన రాయికల్ మండలం అల్లీపూర్‌లో మక్కజొన్న సాగు – సైలేజ్ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సైంటిస్ట్ (అగ్రానమి) డాక్టర్ డీ శ్రీలత సైలేజ్ కోసం అనువైన మక్కజొన్న సాగు చేసే పద్ధతిని రైతులకు వివరించారు. మక్కజొన్న సాగుకు కావాల్సిన విత్తనాలను అందించారు. వ్యవసాయ ఆర్థిక శాస్త్రం శాస్త్రవేత్త డాక్టర్ డీఏ రజినీదేవి మక్కజొన్న సాగు, సైలేజ్ కోసం మక్కజొన్న సాగులో లాభ నష్టాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అల్లీపూర్ ఏఈవో సృజన, రైతు ఐక్య సంఘం చైర్మన్ శంకర్, అభ్యుదయ రైతులు రాజలింగం, రాజన్న, వేణురావు, భీమ్‌రావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ డీ శ్రీలత



సారంగాపూర్: లచ్చనాయక్ తండాలో ప్రచారం చేస్తున్న నాయకులు

## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

సారంగాపూర్, నవంబర్ 20: సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కోల జమున, జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గుర్రాల రాజేందర్ రెడ్డి, నారపాక రమేశ్, రైతు బంధు సమితి జిల్లా సభ్యులు కొల్ముల రమణ, మండల కన్వీనర్లు కోల శ్రీనివాస్, మేరుగు రాజేశం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు తోడేటి శేఖర్ గౌడ్, శీలం రమేశ్, ఉపాధ్యక్షులు గంగాధర్, శ్రీనివాస్ రావు, జాగృతి మండలాధ్యక్షుడు బైరవేని మహేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## లెక్కింపు కేంద్రాల్లో పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా ■ నూకపల్లిలోని లెక్కింపు కేంద్రం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, నవంబర్ 20: శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. సోమవారం నూకపల్లిలోని వీఆర్‌కే కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, అదనపు కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు గదులు, ఏజెంట్స్ రూట్, మీడియా పాయింట్, తదితర ఏర్పాట్లను పరిశీలకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, హెచ్ బసవ రాజేంద్ర, వివేకానంద సింగ్, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, ఆర్డీవో రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీ, ఇతర శాఖ ల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.